## ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

**- మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**



బోనం ఎత్తుకున్న పద్మారెడ్డి

చిన్నశంకరంపేట, జూన్15: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అంబాజిపేట, వెంకట్‌రావ్‌పల్లి, రుద్రారం గ్రామాల్లో నిర్వహించిన గ్రామదేవతల బోనాల్లో ఆమె పాల్గొని, బోనం ఎత్తుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాధవి, పార్టీ మండల అధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్‌లు సాయిలు, లక్ష్మణ్, బాలమణి, శ్రీనివాస్ రెడ్డి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొల్చారం పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్



స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కొల్చారం, జూన్ 15: కొల్చారం పీహెచ్‌సీని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, స్టాక్, ఓపీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. రోగులకు అడిగి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వ దవాఖానలో సంస్థాగత, సాధారణ ప్రసవాలు, ఆరోగ్య మహిళా కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. రిస్క్ ఉన్న కేసులను జిల్లా ఏరియా దవాఖానకు పంపాలన్నారు. అనుమానిత క్యాన్సర్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మహిళలను జిల్లా దవాఖానకు రిఫర్ చేయాలన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులను పూర్తిగా అరికట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీహెచ్‌ఈవో మదన్ మోహన్, ఇతర సిబ్బంది ఉన్నారు.

## ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడి బాలుడు మృతి



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై లింగం

నర్సాపూర్, జూన్15: ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడి బాలుడు మృతి చెందిన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నారాయణపూర్‌లో జరిగింది. ఎస్సై లింగం కథనం ప్రకారం.. పిచ్చకుంట్ల వినయ్(15) బ్రాహ్మణపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం బాలుడి బాబాయి వరుసైన పిచ్చకుంట్ల రాజు, పిచ్చకుంట్ల విష్ణు, మృతుడు వినయ్ ఇంటి నుంచి పొలంలో మట్టి లెవల్ చేయడానికి ట్రాక్టర్, ట్రాలీని తీసుకుని పొలానికి వెళ్లారు. కొంత సమయానికి మృతుడు వినయ్ బర్రెలు మేపడానికి అదే పొలం వద్దకు వెళ్లాడు. ట్రాక్టర్ తీసుకెళ్లిన విష్ణు, రాజు పొలం వద్ద మట్టిని తీసుకుని పక్క పొలంలో పోసి, తిరిగి వెళ్తున్నారు. అదే సమయంలో వినయ్ తన బర్రెలు చెట్టుకు కట్టేసి వీరిద్దరి వద్దకు వచ్చి ఖాళీ ట్రాలీ ఉన్నందున ట్రాక్టర్‌ను నడుపుతానని చెప్పి వారి వద్ద నుంచి తీసుకున్నాడు. వినయ్ ట్రాక్టర్ నడుపుతుండగా రాజు, విష్ణు ఇంజిన్‌పై కూర్చున్నారు. పొలానికి కొంతదూరం వెళ్లి కట్టను ఎక్కిస్తున్న సమయంలో వినయ్‌కి ట్రాక్టర్ కంట్రోల్ కాకపోవడంతో పై నుంచి ఎగిరి కిందపడ్డాడు. అదే సమయంలో ట్రాలీ బోల్తాపడి వినయ్‌పై పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయాలై వినయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్‌పై ఉన్న విష్ణుకు గాయాలయ్యాయి. వినయ్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నర్సాపూర్ ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి తండ్రి పిచ్చకుంట్ల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మహిళ అదృశ్యం.. కేసు నమోదు



ఎల్లవ్వ

రామాయంపేట, జూన్ 15: పాలివాళ్లతో గొడవ జరిగి, తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళ అదృశ్యమైన ఘటన రామాయం పేట మండలం డీ.ధర్మారం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రామాయంపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బూరె ఎల్లవ్వకు వారి పాలివాళ్లైన బూరె రాజుతో 14వ తేదీన రాత్రి గొడవజరిగింది. దీంతో ఆమె తీవ్ర కలత చెంది, అదే రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబీకులు అప్పటి నుంచి వారి బంధువుల వద్ద, ఇతర కుటుంబ సభ్యుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో ఎల్లవ్వ కుమార్తె బూరె మంగమ్మ ఆదివారం రాత్రి రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై.బాలరాజు తెలిపారు.

## వైభవంగా బండ్ల ఊరేగింపు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 15: మెదక్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం వైభవంగా బండ్ల ఊరేగింపు నిర్వహించారు. మాతకు ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. సాయంత్రం ఎడ్ల బండ్లతో ఉత్సవాలు నిర్వహిచారు.

# ఆదమరిస్తే అంతే సంగతులు





ప్రమాదకరంగా కాట్రియాల. దంతెపల్లి, పర్వతాపూర్, లక్ష్మాపూర్ రోడ్డు పక్కనే చెరువు



నిజాంపేట రోడ్డులో పాడుబడ్డ బావులు

- కనిపించని సూచికబోర్డులు
- ప్రమాదాలకు నిలయాలు పాడుబడ్డ బావులు



కాట్రియాల గిరిజన తండారోడ్డు పాడుబడ్డ బావి

రామాయంపేట, జూన్ 15: రామాయంపేట ఉమ్మడి మండలంలోని రోడ్ల వెంట పాడుబడ్డ బావులు దర్శనమి స్తున్నాయి. నిజాంపేట నుంచి జెడ్‌చెర్వు గిరిజన తండాకు వెళ్లే రోడ్డులో రెండు వైపులా పాడుబడ్డ బావులు దర్శనమిస్తున్నాయి. రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ బావుల చుట్టూరా చెట్ల పొదలు కమ్ముకున్నాయి. ఎక్కువగా మూలమలుపుల వద్దనే ప్రమాదకరంగా ఆరు బావులు ఉన్నాయి. రామాయంపేట మండలంలోని కాట్రియాల, దంతెపల్లి, పర్వతాపూర్, కిషన్ తండా, లక్ష్మాపూర్ వెళ్లే రోడ్డులో కిలోమీటర్ పొడవునా చెరువు ఉంది. రోడ్డులో సూచిక బోర్డులు లేవు. రెండు మండలాల్లోని గ్రామాల్లోని మూలమలుపుల వద్ద పాడు బడ్డ బావులు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. బీఆర్‌ఎస్ హయాంలో ప్రమాదాలు జరుగకుండా బావులకు అడ్డంగా కొన్ని ఏరియాల్లో సిమెంట్ దిమ్మెలు నిర్మించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేసిన పనులే తప్ప ఇప్పటివరకు ఉపాధి పథకంలో ఏ ఒక్క పని పూర్తి కాలేదు. ఉపాధి హామీలో పనుల్లో భాగంగా ప్రభుత్వం ఈ బావులను పూడ్చాలి.

### బావుల్లో పశువులు పడుతున్నాయి



రోడ్డు పక్కన పాడుబడ్డ బావులుండడంతో ప్రమాదాలు జురుగుతున్నాయి. ఒక్కో బావి 20 గజాల లోతుగా ఉటుంది. బావుల్లో పశువులు పడి చనిపోతున్నాయి. ఈ బావులను ప్రభుత్వం పూడ్చివేయాలి.

**- మలావత్ సంగ్య, జెడ్‌చెరువు, రామాయంపేట**

### మూలమలుపుల్లో సూచిక బోర్డులు లేవు



మూలమలుపుల పక్కనే పాడుబడ్డ బావులున్నాయి. ఆ రోడ్డు నుంచి కాట్రియాల ద్వారా మా తండాకు చేరుకోవాలంటే ఇబ్బందులు. ఇరుకుగా ఉన్న రోడ్డులో ప్రయాణం గగనమవుతున్నది. ఈ బావులు పూడిస్తేనే మాకు దారి.

**- సబావత్ బిల్యానాయక్, కాట్రియాల గిరిజన తండా**

### రాత్రి పూట ఇంటికస్తమనే గ్యారంటీ లేదు



నిజాంపేట నుంచి మా తండాకు రావాలంటే భయమైతున్నది. ఒక్కో రాత్రి అడవి పందులు మా వెంట పడుతయి. మంద లెక్క వచ్చి దాడి చేస్తాయి. ఈ రోడ్డులో ఏమున్నా కనబడదు. పాడుబడ్డ బావులు, రోడ్డు కూడా అస్తవ్యస్తంగా ఉన్నది.

**- రమావత్ కిమ్య, జెడ్‌చెరువు, నిజాంపేట**

### ప్రభుత్వం ఆదేశాలిస్తే పూడికతీత



పాడుబడ్డ బావులను పూడ్చమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే తాము చెరువుల్లో పూ డిక తీసి బావులను పూడ్చేస్తాం. రెండు మండలాల్లో రోడ్ల పక్కనే పాడుబడ్డ బావులు ఉన్న మాట వాస్తవమే. వాటి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం నుంచి మాకు ఆదేశాలు జారీ చేస్తే తప్పకుండా ప్రమాదకరంగా ఉన్న బావులను పూడ్చివేసే బాధ్యతను చేపడుతాం.

**-ఉపాధి హామీ ఈజీఎస్ ఏపీవో.శంకర్ రామాయంపేట**

# దర్జాగా ఇసుక అక్రమ దందా

- వాల్టా చట్టానికి తూట్లు
- తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 10 గంటల వరకు రవాణా
- నేతలే దోపిడీదారులు కావడంతో కిమ్మనని అధికారులు





ఆరెపల్లి శివారులో గాడిదలపై తెచ్చి నిల్వ ఉంచిన ఇసుక కుప్పలు

పాపన్నపేట,జూన్ 15: జల వనరుల పరిరక్షించాల్సిన నాయకులు వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. మంజీరా నదిని దోచుకుని ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్నారు. తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 10 గంటల వరకు దర్జాగా దందాను కొనసాగిస్తున్నారు. ఆరెపల్లి శివారులోని మాంజీరా నదిని అడ్డాగా చేసుకుని గాడిదలపై ఇసుక దందా చేస్తూ లక్షలు గడిస్తున్నారు. పాపన్నపేట మండలం చుట్టూ మంజీరా నది ప్రవహిస్తుంది. వర్షాకాలంలో భారీగా ఇసుక మేటలు పెడతాయి. దీంతో అక్రమార్కులు ఇసుక దందాకు తెరలేపుతారు. గతంలో ట్రాక్టర్లపై ఇసుక రవాణా చేసేవారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు కేసులు నమోదు చేస్తుండడంతో ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. ప్రస్తుతం గాడిదలపై ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.6 వేలు వస్తుండడంతో ప్రధాన పార్టీల నాయకులు ఇసుక దందాలో పాలుపంచుకుంటున్నారన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

### పొలాల్లో ఇసుక కుప్పల నిల్వలు

రాత్రిపూట గాడిదలపై ఇసుక తీసుకొని వచ్చి పొలాల్లో నిల్వ ఉంచుతున్నారు. అనంతరం ఒక ట్రాక్టర్‌కు రూ.6 వేల చొప్పున అమ్ముకుంటున్నారు. పలువురు వ్యాపారులు రాజకీయ నాయకులు కావడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా నడుస్తున్నది. ఒక వేళ ఎవరైనా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా మీపై కంప్లైంట్ వచ్చింది జాగ్రత్తగా ఉండండి అని వారు నాయకులకు సమాచారం అందజేస్తున్నారు. అంతేగాని కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు. పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు మాత్రమే పోలీస్, రెవెన్యూ అధికారులు దాడులు చేసి ఇసుక డంపులు సీజ్ చేసి చేతులు దులుపుకొంటున్నారు. తప్ప వారిపై కఠినంగా వ్యవహరించిన దాఖలాలు లేవు.

### గాడిదలతో వ్యాపారం

ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు గాడిదలపై ఒడ్డు వరకు ఇసుక తరలిస్తున్నారు. అక్కడి నుంచి సమీప పొలాల వరకు ట్రాక్టర్లపై రవాణా చేసి అక్కడ నిల్వ చేస్తున్నారు. ఇందుకుగాను గాడిదల యజమానులకు రూ.1500, ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేసిన లేబర్‌కు రూ.500 చెల్లిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5500 నుంచి రూ.6 వేల వరకు బయట అమ్ముకుంటున్నారు. నిరుపేదలు ఇల్లు కట్టుకోవడానికి బండెడు ఇసుక తెచ్చుకుంటే వారిపై కేసులు నమోదు చేస్తారు. కార్యాలయాల చుట్టూ తిప్పి నానా ఇబ్బందులకు గురిచేస్తారు. అధికారులు ఖద్దరుకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం చేస్తారు. నాయకుల ఇసుక వ్యాపారంపై కనీసం కన్నెత్తిచూడరు.

# ఏడుపాయల్లో భక్తుల సందడి




పూజలందుకుంటున్న అమ్మవారు

పాపన్నపేట, జూన్15: ఏడుపాయల వన దుర్గా భవానీ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. సెలవు దినాలు కావడంతో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో పుణ్య క్షేత్రం కిటకిటలాడింది. వీరు మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్య స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శ్యాం, బ్రహ్మచారి, బత్తిని రాజు, నర్సింహులు, వరుణాచారి, యాదగిరి, మహేశ్, పరేశ్, దీపక్ తదితరులు ఏర్పాట్లు చేశారు. వేదపండితులు శంకరశర్మ, పార్థీవ శర్మ, రాము శర్మ, శేఖర్ నాగరాజు శర్మ పూజలు నిర్వహించారు. ఏడుపాయల్లో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తన సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టారు.



ఏడుపాయల్లో భారీగా తరలివచ్చిన భక్తులు

## భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి



ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 15: భక్తులతో మెదక్ చర్చి ఆదివారం కిటకిటలాడింది. ఆయా ప్రాంతాల నుంచి వేలాది మంది పర్యాటకులు, భక్తులు రావడంతో చర్చి లోపల కిటకిటలాడింది. యేసయ్య నామస్మరణలతో చర్చి హోరెత్తింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంట గంటకు జరిగిన ప్రార్థనల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రెసీబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య దైవ సందేశం వినిపించారు. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, సువన్ డగ్లస్, సంశాన్ సందీప్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

# సాగు పనుల్లో అన్నదాతలు బిజీబిజీ

- ట్రాక్టర్లతో దున్నుతున్న కర్షకులు
- పత్తి, మొక్కజొన్న విత్తనాలు నాటుతున్న మహిళా రైతులు



పంటలు వేసేందుకు దుక్కులు సిద్ధం చేసిన రైతులు



నాట్లకోసం ముందుగానే వరి తుకాలు వేసుకున్న రైతులు



రామాయంపేట, జూన్15: రామాయంపేట మండల వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతల్లో ఆశలు చిగురించా యి. రైతులు చేను చెలకలకు వెళ్లి వ్యవసాయ పనులు మొదలు పెట్టా రు. పొల్లాలో విత్తనాలను పెడ్తున్నారు. గ్రామాల్లో పత్తి, మొక్కజొన్న విత్తనాలను విత్తుతున్నారు. బోరుబావుల్లో పుష్కలంగా నీళ్లున్న రైతులు నాట్ల కోసం తుకాలు వేశారు. వ్యవసాయశాఖ రైతుల కోసం సబ్సిడీపై విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచింది. దీంతో రైతులు విత్తనాలు, ఎరువులను తమ ఇళ్లలో తెచ్చి పెట్టుకున్నారు. వర్షం ఎప్పుడు పడితే అప్పుడే విత్తుకోవాలనే ఉద్దేశంతో ముందుకు వెళ్తున్నారు.



పొలంలో పత్తి విత్తనాలు విత్తుకున్న రైతులు

### బీడు భూముల్లో పత్తులు విత్తుకుంటాం



వానకాలం పంట కోసం భూములు చదునుచేసి ఉంచాం. రోహిణిలో వర్షాలు పడితే పత్తి విత్తనాలతో పాటు మొక్కజొన్న విత్తుకునే వాళ్లం. వర్షాలు లేటుగా పడ్డా బోరు బావుల్లో భూగర్భ జలాలు ఉన్నాయి. మొదట పత్తి, మొక్కజొన్ననే విత్తుకుంటున్నాం. బీడు భూముల్లో కొంత మేర అంతర పంటలు పత్తి, మొక్కజొన్న విత్తుకున్నా మిగిలిన భూమిలో వరి నాట్లు వేస్తాం. అందుకు వరి తుకాలను కూడా రోహిణిలోనే వేశాం. **- నర్సింహులు, రైతు, ఆర్.వెంకటాపూర్**


### బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు 1) **శ్రీ కోటి వెంకటేశ్వర్ రావు**, 2) **కోటి ఆనంద్ రావు**, 3) **కోటి నాగరాజ రావు** మరియు 4) **కోటి బాబు రావు**, నివాసం: హైదరాబాద్ వారు గులపర్తి గ్రామం, రామాయంపేట్ మండలం, మెదక్ జిల్లా వద్ద గల **సర్వే నెం.921/అ2, 921/అ3, 921/అ5** మరియు **921/అ4**లో ఎక.0.06 గుంటల వ్యవసాయ భూమిని కొనుగోలు చేయుటకు అసలు యజమానులు 1) **శ్రీమతి పెరని ఎల్లవ్వ భర్త స్వర్గీయ ఆగమయ్య**, 2) **శ్రీ పెరని సిద్దరాములు తండ్రి స్వర్గీయ ఎల్లయ్య**, 3) **శ్రీమతి పెరని లక్ష్మి భర్త మల్లేషం మరియు** 4) **శ్రీ పెరని రాములు తండ్రి స్వర్గీయ ఎల్లయ్య**, అందరి నివాసం: గులపర్తి గ్రామం, రామయంపేట్ మండలం, మెదక్ జిల్లా వారితో అమ్మకం ఒప్పందం కుదుర్చుకున్నారు మరియు యజమానులకు అమ్మకం ప్రతిఫలంలో భాగంగా బయానాగా కొంత మొత్తాన్ని చెల్లించారు. ఎవరికైనా సదరు ఆస్తిపై టైటిల్, హక్కు, క్లెయింకు సంబంధించి అభ్యంతరాలు ఉన్నచో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి **7 రోజులలో**గా సంబంధిత డాక్యుమెంట్లతో సహా దిగువ సంతకందారును సంప్రదించండి, లేనిచో నా క్లయింట్లు అమ్మకం లావాదేవీతో ముందుకు సాగుతారు మరియు ఆ తరువాత ఎలాంటి క్లెయింలు అనుమతించబడవు.

సం/- **మెసర్స్ ఆర్.సుధాకర్,** అడ్వకేట్
కార్యాలయం: ఫ్లాట్ నం. 101, విజయ మణిసాయి ఆర్కేడ్, ఇం.నెం.81-369/370/346, శివాజీ నగర్, సికింద్రాబాద్-03, ఫోన్: 9948274745


## రాజకీయ కక్షతోనే కేటీఆర్‌కు నోటీసులు

**బీఆర్‌ఎస్ పట్టణ కన్వీనర్ ఆంజనేయులు**



మెదక్ మున్సిపాలిటీ, జూన్ 15: ప్రజా సమస్యలపై నిరంతరం ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చిందని పార్టీ మెదక్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు విమర్శించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాజకీయ కక్షతోనే బీఆర్‌ఎస్ నేతలపై కేసులు పెట్టుతున్నాదన్నారు. ప్రజల దృష్టి మరల్చేందుకే డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ఏసీబీ నోటీసులతో పేరుతో ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నదని పేర్కొన్నారు.


## ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం



వెల్దుర్తిలో ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న రాష్ట్ర టెక్నికల్ అడ్వయిజరీ రంగనాయకులు

వెల్దుర్తి, జూన్ 15: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఆయిల్‌పామ్ రాష్ట్ర టెక్నికల్ అడ్వయిజరీ రంగనాయకులు తెలిపారు. ఆదివారం మండలంలోని ఎల్కపల్లి శివారులో రైతు సత్యనారాయణ సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలోని మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధికి ఆయిల్‌పామ్ సాగు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో నీటిని ఆదా చేయడంతో పాటు అంతర పంటల సాగుతో మరింత ఆదాయం వస్తుందన్నారు. 40 ఏండ్ల పాటు సాగు అవుతుందన్నారు. దీంతో ఏడాదికి రూ.1.50 లక్షల లాభం వస్తుందన్నారు. ఈ పంటను పశువులు, అడవి జంతువులు నాశనం చేయవని, దళారీల మోసం, తాలు సమస్య ఉండదని, పరిశ్రమలు నేరుగా రైతుల నుంచి పంట కొంటాయని తెలిపారు. దేశ వ్యాప్తంగా 259 లక్షల టన్నుల ఆయిల్‌పామ్ వాడుతున్నట్లు పేర్కొన్నారు. కేవలం 97 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయిల్‌పాం సాగును పెంచేందుకు రాయితీ ఇస్తున్నదని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా మేనేజర్ కృష్ణారావు, డిప్యూటీ మేనేజర్ అశోక్ తదితరులు ఉన్నారు.

## ఇందరిమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ



ఇండ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

పెద్దశంకరంపేట, జూన్15: ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. బాయికాడి పద్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 473 మందికి గృహాల మంజూరు పత్రాలు అందజేశారు. 60 గజాల్లోపు ఇందిరమ్మ గృహలు కట్టుకోవాలని, వారికి బిల్లులు చెల్లిస్తారని, 8 ట్రాక్టర్ల ఇసుక ఉచితంగా ఇస్తారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో షాకీర్‌అలీ, నాయకులు రాయిని మధు, సురేందర్‌రెడ్డి, ఆర్‌ఎన్ సంతోష్, దాచ సంగమేశ్వర్, బాసాడ రాజు, రాజేందర్‌గౌడ్, సుభాశ్‌గౌడ్, తదితరులున్నారు.

## క్రీడా ప్రాంగణంలో యోగా దినోత్సవం



నిజాంపేట, జూన్ 15: నిజాంపేటలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆరోగ్యమే మహాభాగ్యం టీం సభ్యులు ఆదివారం నిర్వహించారు. యోగా శిక్షకుడు మద్దెల భరత్ ధ్యానం, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, వ్యాయమాలు నేర్పించారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



రామాయంపేట, జూన్ 15: రామాయంపేటకు చెందిన కోణపురం వెంకటి అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు రూ.32 వేలను మాజీ కౌన్సిలర్ దేమె యాదగిరి, నాయకులు రమేశ్‌రెడ్డి, అల్లాడి వెంకటి, దామోదర్ చారి, వినయ్‌సాగర్, చింతల స్వామి ఆదివారం అందజేశారు.

## బ్యాగులు, నోటుబుక్కు అందజేత



రామాయంపేట, జూన్ 15: రామాయంపేటలోని ఆరో వార్డుకు చెందిన పేద విద్యార్థులకు బ్యాగులు, నోటుబుక్కులను సంఘ సేవకుడు పుట్టి సందీప్ ఆదివారం అందజేశారు. అదే వార్డుకు చెందిన పేద కుటుంబానికి టార్పాలిన్, రూ.5వేల నగదు అందజేశారు. ఆయన వెంట ఊర ముఖేశ్, శ్రీకాంత్, శ్రీశైలం తదితరులున్నారు.

## మాజీ జడ్పీటీసీకి ఘన సన్మానం



చిన్నశంకరంపేట, జూన్ 15: మాజీ జడ్పీటీసీ పట్లోరి మాధవి రాజు దంపతుల పెండ్లి రోజును పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆదివారం సన్మానించారు.